

# రూ.20 వేల కోట్లు ధారపోత

- గుత్తేదారులకు అదనపు చెల్లింపులు..
- భవిష్యత్తులో సర్కారుకు మరింత భారం
- గత ఏడాది ఏప్రిల్ నుంచి తాజా ధరల వర్తింపు

ఈనాడు - హైదరాబాద్

గుత్తేదారుల గుప్పిట్లో ప్రభుత్వం చిక్కుకుంది. వారి ఒత్తిడికి తలొగ్గింది. ఒప్పందానికి భిన్నంగా గుత్తేదారుల డిమాండ్లకు అనుగుణంగా అదనంగా చెల్లించడానికి అంగీకరించింది. అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఖజానాపై రూ.20వేల కోట్ల భారం పడనుందని అంచనా. ఈపీసీ పేరుతో ఒప్పందం చేసుకుని ఆ విధానానికి ఎప్పుడో తిలోదకాలిచ్చి గుత్తేదారులు చెప్పినట్లల్లా ఆడిన ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా గేట్లు ఎత్తేసింది. ఈపీసీ ఒప్పందంలో లేని లేబర్, మెటీరియల్‌కు అదనంగా చెల్లించడానికి, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి ఒప్పందంలో ఎంత ఉందన్న దాంతో సంబంధం లేకుండా ఎకరాకు రూ.10,500 చెల్లించడానికి, డీవాటరింగ్, కంట్రోల్ బ్లాస్టింగ్‌కు అదనంగా చెల్లించడానికి అంగీకరిస్తూ నీటిపారుదలశాఖ ఉత్తర్వులు (జీఓఎంఎస్-13) జారీ చేసింది.